క్లుప్తంగా

నిత్యావసరాల అందజేత

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్‌బాబు, అధ్యాపకులు సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థకు నిత్యావసరాలు అందజేశారు. అధ్యాపకుల వితరణతో 50 కేజీల బియ్యం 15 లీటర్ల వంట నూనె, టవల్స్, పప్పులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఇన్‌ఛార్జి ఏపీఆర్ చౌదరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు పారేపల్లి వీరవెంకట సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి కల్యాణం



శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: హిందూ ధర్మప్రచారంలో భాగంగా దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో పోలవరంలోని పెద్ద రామాలయంలో బుధవారం శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పట్టిసం శివక్షేత్రం నుంచి పోలవరం గ్రామంలోని రామలయానికి తీసుకువచ్చి కల్యాణ మహోత్సవాలు నిర్వహించినట్లు పట్టిసీమ దేవస్థానం ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 11వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులతో ఫోన్‌లో మాట్లాడి అంగన్‌వాడీ ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీలో అందిస్తున్న భోజనాన్ని ఆమె తిని నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు తాతకుంట్ల నాగలక్ష్మి, ఉగ్గం ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న పాల్గొన్నారు.

ఫీల్డ్ ఫ్రెండ్స్ టీం విజిట్



సీతంపేట సమీపంలో వర్జీనియా తోటలను పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం పరిధిలోగల బయ్యన్నగూడెం, సీతంపేట గ్రామాలలో ప్రాంతీయ అధికారి ఎం.ఆదిశేషయ్య ఆధ్వర్యంలో ఫీల్డ్ ఫ్రెండ్స్ టీమ్ పొగాకు తోటలను బుధవారం సందర్శించింది. ఆధునిక సాగు పద్ధతులతో పాటు నాణ్యమైన పొగాకు ఉత్పత్తి వలన గత రెండు సీజన్లలో రైతులకు గిట్టుబాటు ధర లభించిన విషయాన్ని ఆదిశేషయ్య గుర్తు చేశారు. సీటీఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సుబ్బయ్య, కొయ్యలగూడెం ఆక్షన్ సూపరింటెండెంట్ ఎం.గ్రేసీమార్గరెట్ పొగాకు తోటలు, బారన్‌లో పొగాకు క్యూరింగ్‌ల స్థితిగతులు గమనిస్తూ రైతులకు తగు సూచనలు చేశారు.

బాలిక భవిష్యత్తుకు ఆర్థిక భద్రత



బాలికకు బ్యాంకు పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వారధిట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు వలవల తాతాజీ తెలిపారు. బాలికల చదవుకు ఆటంకం రాకుండా కలగకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం దాతల నుంచి సేకరించిన రూ.25 వేలను బ్యాంకులో డిపాజిట్ చేసి ఆ బ్యాంకు పుస్తకాన్ని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఏడు సంవత్సరాల బాలిక మాదారపు డిహవి శ్రీశేషినికి, తల్లి సుమలత సమక్షంలో అందజేశారు.

ఉచిత పశువైద్య శిబిరం

చింతలపూడి: పశువులకు ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపి వైద్య సేవలు అందిస్తే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చునని సర్పంచ్ యడ్లమోహన్‌రావు అన్నారు. యండపల్లి గ్రామంలో సేవా సంస్థ ఆధ్వర్యంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ సహకారంతో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వం మొబైల్ పశు వైద్యశాలలను ఏర్పాటు చేసి రైతులకు ఎంతో మేలు చేకూర్చినట్లు సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. గ్రామంలోని పశువులకు, మేకలకు పశువైద్యాధికారి డా.నాగేశ్వరరావు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. సేవా సంస్థ కార్యదర్శి రాజారావు, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మంచి జరగాలంటే జగనే రావాలి

- వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు
- కొండగూడెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త విజయరాజు

కామవరపుకోట: రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేస్తాయని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. బుధవారం మండలంలో కామవరపుకోట శివారు కొండగూడెం నుంచి బొర్రంపాలెం వరకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు 8 కి.మీ గాను, ప్రభుత్వ నిధులు రూ.2 కోట్ల 20 లక్షలు కేటాయించి ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మండలంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మరలా ప్రజలకు మంచి జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త పార్టీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని ఆయన కోరారు. విజయరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుంచి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ విద్యను అందించాలనే తపనతో నాడు-నేడు ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చడం ద్వారా విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్పొరేట్ వైద్యం అందించే ఉద్దేశంతో పేదల వైద్యానికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షలు కేటాయించి వైద్య రంగానికి, రైతులకు మేలు చేసే విధంగా రైతు భరోసా, వైఎస్సార్ జలకళ వంటి అనేక పథకాలతో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన అన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలు సీఎం జగన్ వైపే చూస్తున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ సాయిన కనకరాజు, రాష్ట్ర ముదిరాజ్ సంఘం డైరెక్టర్ చిక్కుల శ్రీను, కామవరపుకోట ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, ఎంపీటీసీ పోలిమెట్ల ప్రశాంత్, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, ఎస్కే కరీముల్లా, సిద్దిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆళ్ల నానిని కలిసిన బన్నీ రెడ్డి



ఆళ్ల నానిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాసర బన్నీ రెడ్డి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం టౌన్ యూత్ అధ్యక్షుడిగా నియమితులైన కాసర బన్నీ రెడ్డి బుధవారం ఏలూరులో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆళ్ల నానిని మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. బన్నీ రెడ్డి వెంట కాసర తులసి రెడ్డి, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు, నేట్రు గణేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- కొండరెడ్లకు ఇళ్ల నిర్మాణ పత్రాల అందజేత



కొండరెడ్లకు మంజూరైన ఇంటి నిర్మాణ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలోని ప్రతి పేదవాడికి సొంత గృహం ఉండే విధంగా గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జన్‌మన్) కార్యక్రమంలో కొండరెడ్డి గిరిజనులకు మంజూరైన ఇళ్ల నిర్మాణ పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పక్కా ఇళ్లు ఉండాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. అలాగే పీఎం జన్‌మన్ కార్యక్రమంలో కొండరెడ్డి గిరిజనులకు మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించామన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చదువుకోవడం ద్వారానే పేద కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గిరిజనులు తప్పనిసరిగా తమ పిల్లలను బడులకు పంపించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం వైఎస్ జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలోని విద్యకు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. కొండప్రాంతాల్లో ఉండే గిరిజనులు బయటప్రాంతాల్లోకి రావాలని తద్వారా మారుతున్న కాలంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకుని అభివృద్ధి పథంలో ముందుకుసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, హౌసింగ్ అధికారులు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, వేలేరుపాడు ఎంపీపీ వాలా లక్ష్మీదేవి, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు, మాల్చి వెంకన్నబాబు, కుంజా దుర్గ, మడకం రామలక్ష్మి, పెడకం విజయలక్ష్మి, కె.లక్ష్మి, పులిరామన్నగూడెం సర్పంచ్ మడి శ్రీరాములు, ఏజెన్సీప్రాంతంలోని గ్రామాలకు చెందిన కొండరెడ్డి గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్, గైడ్స్ విద్యార్థులకు అభినందనలు



అభినందన సభలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కామవరపుకోట: స్కౌట్, గైడ్స్‌తో విద్యార్థులలో మంచి క్రమశిక్షణతో పాటు, సమయపాలన, సేవ భావం, దేశభక్తి అలవడుతుందని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు బొడ్డు రాములు అన్నారు. ఇటీవల గణతంత్ర దిన వేడుకల్లో కవాతులో పాల్గొని, జిల్లా కలెక్టర్ చేత ప్రశంసాపత్రం అందుకున్న పాఠశాల స్కౌట్, గైడ్స్ విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగట్ల నాగేశ్వరరావు, ఆర్గనైజ్ మరీదు శ్రీహరిని బుధవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం రాములు విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

పరేడ్‌లో జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: జనవరి 26న ఏలూరు జిల్లా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లోవాకుమారి తెలియజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను అభినందించారు. విద్యార్థులతో పాటు స్కౌట్స్ ఆర్గనైజింగ్ జిల్లా కమిషనర్ మరీదు శ్రీహరిబాబు, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ బీవీఎస్ఆర్‌కె ప్రసాద్, డి.కిరణ్‌కిషోర్ పాల్గొన్నట్లు వివరించారు. కాగా, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఫర్ స్కౌట్స్‌గా మరీదు శ్రీహరిబాబు జిల్లా కలెక్టర్‌చే నియమితులైన నేపథ్యంలో హెచ్‌ఎం లోవకుమారితో పాటు, ఉపాధ్యాయులు శ్రీహరిబాబుకు అభినందనలు తెలిపారు.

హక్కులపై విద్యార్థి దశలోనే అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల గురించి విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. వీధిబాలల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక స్థితిగతులు, తల్లి,దండ్రుల మధ్య గొడవల కారణంగా కొందరు పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి వీధిబాలలుగా మారుతున్నారని అన్నారు. అటువంటి వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ గృహాలకు అప్పగించి ఆశ్రయం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో పిల్లల్ని కిడ్నాప్ చేసి గంజాయి మాఫియాగా, అడుక్కునే మాఫియాగా, బాల కార్మికులుగా తయారు చేస్తున్నారని అన్నారు. అటువంటి బాలలు కనిపిస్తే తక్షణం 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటారని తెలిపారు. ర్యాగింగ్ నిరోధక చట్టం, ట్రాఫిక్ ఉల్లంఘన చట్టాలను గురించి అవగాహన కలిగించారు. ప్రభుత్వం పిల్లల చదువుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోందని, చిన్నారులు కష్టపడి ఇష్టంగా చదివి మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. టీవీలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సోమసుందరం, న్యాయవాదులు పింగుల దేవిడ్‌రాజు, ఉమర్ ఫరూఖ్, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరులో 'సిద్ధం' సభకు తరలిరావాలి



కొయ్యలగూడెంలో పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: ఈనెల 3వ తేదీన దెందులూరులో తలపెట్టిన 'ఎన్నికలకు సిద్ధం' సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం కొయ్యలగూడెంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో, క్రియాశీలక కార్యకర్తలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తుంటే కుయుక్తుల కుట్రధారి చంద్రబాబు 'సన్'క్షేమం కోసం అర్రులు చేస్తున్నారని, దానికి ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ వంత పాడుతున్నారు అని బాలరాజు ఎద్దేవా చేశారు. దెందులూరు సభకు పోలవరం నియోజకవర్గం నుంచి పదివేల మంది శ్రేణులు పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. క్రియాశీలక కార్యకర్త కట్టారాము నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అదేవిధంగా దళితవాడలోని పూలపల్లి బ్రదర్స్‌ను పరామర్శించారు.

బుట్టాయగూడెం: ఈ నెల 3వ తేదీన దెందులూరులో జరగనున్న ఎన్నికలకు సిద్ధం సభకు పోలవరం నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి కోరారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై బుధవారం రాత్రి కొమ్ముగూడెంలో మహిళలతో ఆమె మాట్లాడారు. తూర్పు, పశ్చిమ, ఏలూరు, కృష్ణా జిల్లాలకు చెందిన నాయకులను, కార్యకర్తలను ఉత్తేజపరిచే విధంగా 3వ తేదీన దెందులూరులో ఎన్నికలకు సిద్ధం సభ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

కులగణనలో జంగారెడ్డిగూడెం ముందంజ

జంగారెడ్డిగూడెం: కులగణనలో జిల్లాలో జంగారెడ్డిగూడెం అర్బన్, రూరల్ ముందంజలో ఉన్నాయని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే వేగంగా జరుగుతోందన్నారు. ఇప్పటికే జంగారెడ్డిగూడెం పట్టణంలో 93 శాతం, రూరల్ మండలంలో 97 శాతం నమోదైందన్నారు. ప్రజల సహకారంతోనే పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అన్ని సచివాలయాల్లో తుది ఓటరు జాబితాను ప్రదర్శించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో వారి పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. ఏమైనా మార్పులు ఉంటే వెంటనే మీసేవ, పోస్టాఫీసు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం రూరల్ 1407 ఇళ్లు, పట్టణం పరిధిలో 2,300 వరకు ఇళ్లు రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ ప్రక్రియ చేపడుతామన్నారు.

శరవేగంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ పనులు



శివాలయం వద్ద ఏక శిల ధ్వజస్తంభాన్ని క్రేన్ సహాయంతో కిందకు దించుతున్న దృశ్యం

టి.నరసాపురం: స్థానిక కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. వరంగల్ నుంచి 35.7 అడుగుల పొడవు గల ఏక శిల (కృష్ణ శిల) ధ్వజస్తంభాన్ని తయారు చేయించి ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం టి.నరసాపురం తీసుకువచ్చారు. స్థానిక ప్రధాన వీధిలో ధ్వజస్తంభాన్ని ఊరేగించి, శివాలయానికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. టి.నరసాపురంలో 28 ఏళ్ల క్రితం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి, స్వామిని ప్రతిష్ఠించిన సమయంలో కలప ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఆ ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కమిటీ సభ్యులు భక్తుల సహకారంతో ఏకశిలతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు సంకల్పించారు. ఫిబ్రవరి 29న ధ్వజస్తంభాన్ని పునః ప్రతిష్ఠించనున్నారు. దానికి అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు, ఉత్సవ కమిటీ నాయకులు మురళి, రాము తదితరులు ఆధ్వర్యం వహిస్తున్నారు.

ఆరోగ్య విప్లవానికి నాంది



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆరోగ్య విప్లవానికి నాంది అని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. చిన్న సమస్యలకు కూడా పెద్దాసుపత్రులకు వెళ్లకుండా ఆరోగ్య సురక్ష కార్యక్రమంలోనే పరీక్షలు నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ప్రజలు వారి ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు నిర్వహించుకుని వైద్య సలహాలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్య చికిత్స అవసరం అయితే వైద్యులు పెద్దాసుపత్రులకు సూచిస్తారన్నారు. వైద్యం అన్ని విధాలుగా పేదవాడికి అందుబాటులో ఉండాలనేదే సీఎం జగన్ ఆశయం అన్నారు. ఒక వేళ పెద్ద చికిత్సలు అవసరమైతే ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం చేయించుకునేందుకు ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచారన్నారు. ఈ సందర్భంగా వైద్యశిబిరంలో చైర్‌పర్సన్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, ఏలూరు జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, కౌన్సిలర్‌లు పీపీఎస్ చంద్రరావు, తాతకుంట్ల నాగలక్ష్మి, అయినాల వెంకట రమణమూర్తి, ఉగ్గం దుర్గాప్రసాద్, ఎల్.వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు గూడపాటి రాధాకృష్ణ, బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, కళ్యాణ వర్మ, గెద్దాడ శ్రీను, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలపై ఫిర్యాదు అందలేదు'

జంగారెడ్డిగూడెం: ఇటీవల జంగారెడ్డిగూడెం సొసైటీపై వచ్చిన ఆరోపణలపై సొసైటీ రైతుల నుంచి గాని, ఖాతాదారుల నుంచి గాని ఎటువంటి ఫిర్యాదులు తమకు అందలేదని సొసైటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎ.సాయిబాబా అన్నారు. స్థానిక డీసీసీబీ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సొసైటీ (పీఏసీఎస్)కు సంబంధించి విచారణలో ఏమీ తేలలేదని వెల్లడించారు. ఇదిలా ఉండగా, రైతులకు రుణాలకు సంబంధించి చెక్కులపై సాయిబాబ సంతకం పెట్టడం లేదని, పలువురు రైతులు ఆరోపించారు. దీనిపై వివరణ కోరగా, అటువంటిది ఏమీ లేదని, రైతులకు సొసైటీ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు లంచం అడుగుతున్నట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇదిలా ఉంటే కొండ్రెడ్డి భాస్కరరావు అనే రైతు, అలాగే పలువురు రైతులు విలేకరులతో మాట్లాడుతూ సాయిబాబాను చైర్మన్‌గా తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండే అధికారిని నియమించాలని రైతులు కోరారు.

వన్‌దన్ యోజన కేంద్రాలు సక్రమంగా వినియోగించాలి



ఐటీడీఏ ఏపీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలో మంజూరైన ప్రధానమంత్రి వన్‌దన్ యోజన వికాస్ కేంద్రాలు సక్రమంగా నిర్వహించేలా కృషి చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ ఏపీఓ వీవీఎస్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మొడియం శ్రీనివాసరావు, కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచనమాల మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తుల ప్రోసెసింగ్, ప్యాకింగ్ అమ్మకాలు జరిగి గిరిజనుల ఉపాధి మెరుగుపరచడం కోసం ప్రధానమంత్రి మోదీ సుమారు 15 కేంద్రాలను ఏర్పాటు చేశారని అన్నారు. వాటిన్నింటినీ సక్రమంగా నిర్వహించేలా చూడాలని కోరారు. అలాగే కోయభాష వలంటీర్‌లకు గౌరవవేతనం రూ.15 వేలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఆర్.చౌదరి, కరిబండి నాగరాజు, చాట్రాతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధ విద్య తప్పనిసరి

కొయ్యలగూడెం: రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు ప్రకారం 14 ఏళ్ల లోపు బాల బాలికలకు నిర్బంధ విద్య అమలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది అని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీధి బాలల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వీధి బాలల గుర్తింపు, అదే విధంగా వారిని విద్యా స్రవంతిలోకి చేర్చుకునే విధానం గురించి ఐసీడీఎస్ పీవో యు.స్వర్ణకుమారి అవగాహన కల్పించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

పులిజాడ కోసం ట్రాప్ కెమెరాల ఏర్పాటు

ద్వారకాతిరుమల: గత కొద్దిరోజులుగా ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల ప్రజలను వణికిస్తున్న పెద్ద పులిని పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు శ్రమిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని ఐఎస్ జగన్నాధపురం అటవీ ప్రాంతంలోని చెట్లకు బుధవారం ట్రాప్ కెమెరాలను అమర్చారు. అలాగే ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో టాంటాం వేయించారు. ఇదిలా ఉంటే ఐఎస్ జగన్నాధపురం కొండపైకి పులి వచ్చిందంటూ కొందరు వదంతులు సృష్టించారు. దాంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చివరకు అవి వదంతులని తెలిసి అంతా ఊపిరిపీల్చుకున్నారు.

పులి భయంతో బెంబేలు

కామవరపుకోట: పులి భయంతో జీలకర్రగూడెం గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామానికి చెందిన మిరియాల బాలరాజు, కుమారుడు యేసు రాజు మంగళవారం రాత్రి పనులు ముగించుకుని గ్రామ శివారులో సబ్ స్టేషన్ సమీపంలోగల తమ ఇంటి వరండాలో, తండ్రి, కొడుకులు నిద్రిస్తుండగా అర్ధరాత్రి తర్వాత సుమారు 3 గంటల సమయంలో తమ మంచం దగ్గరికి ఏదో ఒక పెద్ద జంతువు వచ్చిందని, దుప్పటి ముసుగులోంచి చూసి భయంతో ఇంటి లోపలకి పరిగెత్తుకుని వెళ్లి తలుపులు కిటికీలు మూసివేసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. గ్రామస్తులు వచ్చిన తర్వాత తలుపులు తెరిసి చూడగా అప్పటికే ఆ జంతువు వెళ్లిపోయిందని, అది కచ్చితంగా పులి అని యేసు రాజు వాదిస్తున్నాడు. అయితే గ్రామం, అడవి పక్కనే ఉండటంతో చీకటి పడగానే, అనేక జంతువులు ఊర్లోకి చొరబడతాయని, అది పులి కాకపోవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా మరియతల్లి ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలకు ముస్తాబు చేసిన మరియతల్లి ఆలయం

చింతలపూడి: అల్లిపల్లి మరియతల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాలను ఇక్కడ జరుపుతారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పలు గ్రామాల నుంచే కాక ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి కూడా మేరీ మాత భక్తులు ఈ ఉత్సవాలకు భారీగా తరలి వస్తారు. సుమారు లక్ష మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేశారు. కొండపైకి చేరుకోవడానికి దారిని చదును చేసి, విద్యుద్దీపాలతో అలంకరించారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.